# విప్లవకారుడు

(గల్పిక)

ఆయన పెళ్ళి చేసుకున్నాడు. ఆయన పూజా మందిరంలో ఉన్న దేవుడు గాక, ఆవిడ ఒక దేవతను తెచ్చింది. ఇద్దరూ కీచులాడుకున్నారు. పూజా మందిరంలో అగ్రస్థానం దేవుడిదా, దేవతదా ?

పురోహితుణ్ణి పిలిచారు. "మీరు అనవసరంగా కీచులాడుతున్నారు. ఆ దేవత ఆ దేవుడికి భార్యే తప్ప విడిచి మరొకటి ఏమిటిన్నూ కాదు!" అన్నాడు పురోహితుడు.

భార్యాభర్తలకు రాజీ కుదిరింది. వాళ్ల కడుపున నాలుగు కాయలు కాశాయి. స్వతంత్ర భారతంలో వాళ్లు విదేశీ చదువులు చదివితే గాని పైకిరారని, తల్లిదండ్రులు వాళ్ళన్నుక్రైస్తవ బళ్లలో వేశారు. వాళ్లు చదువు పూర్తి అయే లోపల ఏసుక్రీస్తే దేవుడనీ, సిలువను మెడలో తగిలించుకుని కళ్లకు అద్దుకో వచ్చుగాని, దేవుళ్లనూ, దేవతలనూ పూజించటం మూఢవిశ్వాసమనీ అన్నారు.

మళ్ళీ సంఘర్షణ మొదలయింది. పురోహితుణ్ణి పిలిచారు.

"క్రీస్తు అనగా ఎవరు ? మన కృష్ణుడే. జైల్లో పుట్టాడు. అసలు దేవుడు ఒకడే. మనం అతనికి ఏవేవో పేర్లు పెట్టుకుని తగాదా పడతాం తప్పవిడిచి మరొకటి ఏమిన్నూలేదు," అన్నాడు పురోహితుడు.

కూతురికి పెళ్ళి చేశారు. అల్లుడు అత్తవారింటికి వచ్చి పూజా మందిరం నిండా దేవతలనూ, గోడలమీద ఏసుక్రీస్తు పటాలనూ చూసి, "మీ మొహాలు మండా, మీ రింకా ఈ రాతియుగంలోనే ఉన్నారా ?" అంటూ విగ్రహాలనూ పటాలనూ విసురు పుచ్చుకుని వీధిలో పారేశాడు.

మామగారూ, బావమరదులూ అతన్ని విప్లవకారుడని పోలీసులకు అప్పగించారు. అతనిమీద నాస్తికుడని చార్జి పెట్టలేదు; ఆస్తి హక్కులకు విరోధి అనీ, సాయుధ విప్లవవాది అనీ, రాజ్యాంగాన్ని నాశనం చేయ జూస్తున్నాడనీ వేరు వేరు సెక్షన్ల కింద చార్జీ చేశారు

అన్ని ఆరోపణలూ నిజమేనని అల్లుడు ఒప్పేసుకున్నాడు.

---

*కొడవటిగంటి కుటుంబరావు*